స్వాతి మాస పత్రిక (అక్టోబరు2008)

# చంద్రహారం

–ఆకునూరి మురళీకృష్ణ

" అమ్మా శారద వచ్చింది చూడు ? " అన్న సిద్దార్థ మాటలతో ఒక్కసారిగా సంతోషంతో కళ్ళు తెరిచాను. వాళ్ళిద్దరూ పక్క పక్కనే నిలబడే దృశ్యాన్ని ఒక్క క్షణం కూడా మిస్సవ్వ కూడదన్నట్టుగా గబుక్కున కళ్ళు తెరిచి కళ్ళజోడు పెట్టుకున్నాను.

కళ్ళ ముందర దృశ్యం మసగ్గా అస్పష్టంగా కనిపించింది ఎప్పటిలాగానే. అయితే, నా మనసులో వున్న దృశ్యం మాత్రం మచ్చలేకుండా సజీవంగా కళ్ళముందు సాక్షాత్కరించింది. స్కూలు నుంచి అలిసిపోయి ఇంటికి వచ్చి గుమ్మంలో నిల్చున్న సిద్దూ, శారద ! నాకెంతో ఇష్టమైన దృశ్యమది. పిల్లల్నిద్దరినీ కళ్ళ నిండుగా అలా చూసుకుంటూ ఆ రోజుల్లో సంతోషంతో మనసు నింపుకునేవాళ్ళం నేనూ, ఆయనా. మళ్ళీ ఆ దృశ్యం గుర్తుకురావడంతో నాకు ఎక్కడలేని బలం వచ్చినట్లైంది.

వయసు వల్ల శరీరంలో అన్ని అవయవాలనీ పని చేయనీయకుండా చేసి మెదడుని మాత్రం ఇంకా అలాగే వదిలేసినందుకు దేవుడ్ని ఎప్పుడూ తిట్టుకుంటూ వుంటాను, మంచంలో పడుకుని అనవరసరమైన ఆలోచనలతో సతమతమవుతున్నానని. అప్పుడప్పుడిలా సంతోషిస్తూ వుంటాను కూడా. ఈ జ్ఞాపకాలింకా బ్రతికి వున్నది ఆ మెదడు వల్లే కదా !

కనపడని దృశ్యంలో శారదనింకా చిన్న పిల్లగానే ఊహించుకుంటూ " రామ్మా శారదా " అన్నాను.

శారద వచ్చి పక్కనే కూర్చుంది. ఇప్పుడు దాని రూపం నాకు స్పష్టంగా కనిపిస్తోంది. ప్రయాణం వల్ల కొద్దిగా రేగిన తల, పాపిట మధ్య సింధూరం, కళ్ళలోని భావాలని స్పష్టంగా కనిపించనివ్వని కళ్ళజోడు... మధ్య వయసు రావడంవల్ల సహజమైన నిగారింపుని, సౌకుమార్యాన్ని క్రమంగా కోల్పోతున్న ముఖం... వీటన్నింటి మధ్యనుంచీ నాకు స్పష్టంగా కనిపిస్తున్న దాని చిన్ననాటి పోలికలు !

ఆప్యాయంగా దాని తల నిమిరాను. " ఈ వేళలో ఎందుకు వచ్చావే ? ఆఫీసు సెలవు పెట్టేవా ? " అని అడిగాను.

" అవును... నీకెలా వుంది ? "

జవాబు చెప్పలేని ప్రశ్న... చెప్పాలనిపించని ప్రశ్న... డాక్టర్లు పరీక్షించి 'రోజుల్లో ' అని చెప్పేసారు. నాకూ అంతా తెలుస్తూనే వుంది.

నేనేదో ఆలోచించి సమాధానం చెప్పేలోగానే ఆ అవస్థనించి నన్ను తప్పిస్తూ ఒక పెద్ద దగ్గు తెర, ఆపై ఆయాసం నన్ను కుదిపేసాయి. రెండు నిమిషాల తర్వాత తేరుకుని తేలిగ్గా నవ్వేస్తూ "ఇదుగో ఇలా వున్నాను " అన్నాను.

శారదకి కబురు చేయమని అసలు నేనే సిద్దూకి చెబుదామనుకుంటున్నాను. ఆఖరి క్షణాల్లో పిల్లలతో గడపాలని, వాళ్ళని చూస్తూ జీవితంలోని మధుర క్షణాలని గుర్తుచేసుకుంటూ తృప్తిగా తుది శ్వాస విడవాలని నా కోరిక. అనుకోకుండా అదే వచ్చింది.

" పిల్లలెలా వున్నారు ? తీసుకురాకపోయావా ? చూసి చాలారోజులైంది ? " అన్నాను.

" ఇవాళేవో ప్రాక్టికల్ క్లాసులున్నాయంట. రేపాదివారం వస్తామని నీతో చెప్పమన్నారు " అంది శారద.

నేను నవ్వేను. శారద వుండేదీ హైదరాబాద్‌లోనే అయినా వాళ్ళుండేదొక మూల, మేముండేదొక మూల. ఆ ప్రయాణానికి ఎంత యాతన పడాలో నాకు తెలుసు. అందులో ఇంజనీరింగ్ చదువుతున్న పిల్లలు... వాళ్ళకుండే సమయమే తక్కువ... ఆ తక్కువ సమయంలో వాళ్ళకుండే ప్రాధాన్యతలు వాళ్ళకుంటాయి.

నాకు శారద, సిద్దూల కాలేజ్ రోజులు గుర్తుకు వచ్చాయి. ఆదివారం కానీ ఏదైనా పండుగ రోజు కానీ వచ్చిందంటే మేము పిల్లలతో కలిసి గుడికి వెళ్ళాలనుకునే వాళ్ళం. దేవుడి మీదున్న భక్తితో కాదు. ఆ రోజుల్లో అంతకన్నా వినోదం వుండేది కాదు. సినిమాలకెళ్ళాలంటే ఖర్చుతో కూడుకున్న పని కనుక. మాతో గుడికి రావడానికి వాళ్ళకి ససేమిరా ఇష్టముండేది కాదు. ఏవేవో పనులు చెప్పి స్నేహితులతో బయటికి వెళ్ళిపోయేవారు. "వారం రోజులూ కాలేజ్‌లో చెప్పుకున్న కబుర్లు సరిపోవర్రా ? ఆదివారం కూడా వాళ్ళ ముఖాలు చూడకపోతే తోచదా మీకు ? " అంటూ ముద్దుగానే విసుక్కునే వాళ్ళం. వాళ్ళ జేబుల్లో నెలమొత్తానికి తీసుకున్న బస్ పాస్‌లూ, బ్యాగులో నేను ఉదయానే చేసిచ్చిన టిఫిన్ బాక్సూ మహా అయితే ఒకసారి ఇద్దరు స్నేహితులతో కలిసి టీ తాగడానికి సరిపడే చిల్లర వుండేవంతే. అంతకు మించి పాకెట్ మనీ ఇవ్వగలిగే ఆర్థిక స్థోమత మాకుండేది కాదు. కొంచెం అటూ ఇటూగా వాళ్ళ స్నేహితులంతా కూడా అలాగే వుండే వాళ్ళు. అయినా ఆ రోజుల్లో వాళ్ళెంత ఉత్సాహంగా, సంతోషంగా వుండే వాళ్ళనీ ? తుళ్ళి తుళ్ళి పడుతున్న సెలయేరులా వుండే వాళ్ళు. వాళ్ళని చూస్తుంటే మాకు కూడా సంతోషంగా వుండేది.

ఇప్పుడు చదువులు పూర్తి చేసుకుని ఉద్యోగాలొచ్చి జీవితంలో సెటిలయ్యాక కూడా అలాంటి ఉత్సాహాన్ని మళ్ళీ వాళ్ళ ముఖాల్లో చూడలేకపోతున్నాను. ఏమిటి తేడా ?

" మాది చాలా దురదృష్టపు తరమమ్మా... మేము పెరుగుతున్న రోజుల్లో చదువులకీ పోటీనే, ఉద్యోగాలకీ పోటీనే... అన్నింటికీ కరువే. ఎన్ని తెలివి తేటలున్నా మేము కేవలం గుమాస్తా ఉద్యోగాలతోనూ, టీచరు గిరీలతోనూ సరిపెట్టుకోవాల్సి వచ్చింది. మేమిలా ఉద్యోగంలో సెటిలయ్యామోలేదో మా కళ్ళముందే ప్రపంచం ఎలా మారిపోయిందో చూడు... గ్లోబలైజేషన్ పుణ్యమాని ఇవాళ లక్షలకొద్దీ ఉద్యోగాలు. మల్టీ నేషనల్ కంపెనీల పుణ్యమాని వేలకొద్దీ జీతాలు ! నా జీతం నాలుగంకెలు కావడానికి నేను పన్నెండేళ్ళు ఎదురు చూడాల్సి వచ్చింది. ఇవాళ డిగ్రీ పాసయి కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగంలో చేరే కుర్రాళ్ళ జీతం నా ప్రస్తుత జీతానికి రెట్టింపు వుంటోంది. చూస్తుంటే గుండె తరుక్కు పోతుంది. మీ తరం వాళ్ళకిదంతా తెలియదు. మా తర్వాతి తరం వాళ్ళు తేలికగా దీన్ని అందుకో గలరు. మేమే... రెంటికీ చెడ్డ రేవడుల్లా తయారయ్యాం " అన్నాడొకసారి సిద్దూ నాతో.

వాడు చెప్పింది నిజమే... ప్రపంచం ఇంతగా మారిపోయినా వాడి ఆర్థిక స్థితిలో మాత్రం పెద్దగా మార్పేం లేదు. వాళ్ళు కూడా మాలాగే ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఆనందం అన్నది డబ్బుతోనే వస్తుందా ?

నా మెదడిలా పిచ్చి పిచ్చి ఆలోచనలతో పరుగిడుతుంటే శారద నింపాదిగా కూర్చుని వదిన ఇచ్చిన కాఫీ త్రాగుతూ నా ఆరోగ్యం గురించి క్లుప్తంగా ప్రశ్నించసాగింది. ఎందుకో నాకు ఆ ప్రశ్నలకి సమాధానం చెప్పాలనిపించలేదు. అలాంటి ప్రశ్నలాశించి కాదు దాని రాకని కోరుకున్నది నేను.

ఆ ప్రశ్నలకి పొడి పొడిగా సమాధానం చెప్పి మాట మారుస్తూ " మీ చిన్నపుడు అమ్మమ్మ వాళ్ళూరికెళ్ళినపుడు నీతో ఆడుకునే పాలేరు మంగయ్య కూతురు సీత గుర్తుందా ? " అన్నాను.

అవుననీ కాదనీ కాకుండా తలూపింది శారద ఇప్పుడావిషయం ఎందుకన్నట్టుగా.

" వాళ్ళ చుట్టాలమ్మాయికి హైదరాబాద్ సంబంధం చేసార్ట. మనుగుడుపులకని ఈ ఊరొచ్చింది. మన వాళ్ళ దగ్గర సిద్దూ అడ్రస్ తీసుకుని నన్ను చూడడానికి వచ్చింది. నీ గురించి ఒకటే గుర్తు చేసుకుంది, నిన్ను ఎలాగైనా చూడాలనుకుంది. కానీ ఆ రోజే ప్రయాణం కావడంతో కుదరలేదు దానికి. చిన్నపుడు ఎలా వుండేదీ ? ఇప్పుడెంత మారిపోయిందనుకున్నావు ? నాకైతే చూస్తుంటే ఆ వయసులో వాళ్ళ అమ్మని చూసినట్లే అనిపించింది " అన్నాను ఉత్సాహంగా.

శారద నవ్వింది. కాగితం పువ్వు విచ్చుకున్నట్లుగా ఆ నవ్వు సహజంగా అనిపించలేదు. అంతలోనే ఏదో గుర్తుకు వచ్చిన దానిలా అంది " అన్నట్టు మన పొలం అమ్మేసాక కేసు వాదించిన లాయర్‌కివ్వాల్సిన డబ్బుపోగా మిగిలిన డబ్బు మనకి పంపిస్తానన్నాడు మావయ్య పంపించాడా ? "

నేనేదో చెప్పబోతుంటే సిద్దూ రెడీ అయి అక్కడికి వచ్చి నవ్వుతున్న శారదనీ నన్నూ చూస్తూ నిలబడ్డాడు. " నిన్ను చూసి అమ్మకి ఓపిక వచ్చింది " తనూ నవ్వుతూ శారదతో అన్నాడు.

" నువ్వు కూడా ఇవాళ ఆఫీసుకి సెలవు పెట్టెయ్య కూడదూ ? శారద వచ్చిందిగా ? " ఆశగా అడిగాను వాడిని.

" సెలవైతే పెట్టాను కానీ బయట పనుందమ్మా... వెళ్ళి తొందరగా వచ్చేస్తానులే " అన్నాడు.

" ఇవాళ వాడి ఇల్లు రిజిస్ట్రేషన్ వుందట. అలాగని ఫోన్ చేస్తే నీ దగ్గర నేను వుంటాను వెళ్ళి రమ్మని నేను వచ్చాను " చెప్పింది శారద. శారద మాటలు పూర్తయ్యేలోగా నాటకంలో మరో పాత్ర ప్రవేశించినట్టు తయారై వచ్చి సిద్దూ వెనకాల నిల్చుంది కోడలు.

నాలో చిన్నపాటి నిరాశ. కొడుకూ కూతుర్లని దగ్గర కూర్చోపెట్టుకుని కబుర్లు చెప్పుకుందాం అనుకున్నాను. అయినా ఇల్లు కొనాలన్న సిద్దూ చిరకాల వాంఛ నెరవేరుతోంది కదా ఇవాళ ? వాడి ముఖంలో సంతోషం చూడడం కన్నా నాకు కావలసిందేముంది అనకుంటూ వాడికేసి చూసాను. సిద్దూ ముఖంలో సంతోషం ఛాయలు లేవు. అప్పు చేసి కొంటున్నాడు కదా ? కట్టవలసిన లోను ఇన్‌స్టాల్‌మెంట్లు, ఇంటి ఖర్చులూ మెదడులో తిరుగుతూ కళ్ళలోంచి నాకు కనిపిస్తున్నాయి.

నేను ఏదో అనేలోగానే " రిజిస్ట్రేషన్ అయిపోగానే త్వరగా వచ్చేస్తాం " అంటూ నాతోనూ, శారదతోనూ చెప్పి బయలు దేరారు వాళ్ళిద్దరూ.

శారద ఏదో వెదుకుతున్నట్లుగా నాలోకే చూడడం నేను గమనించాను. అదేం చెప్పాలనుకుంటోందో నాకైతే తెలియదు కానీ, నాకు మాత్రం దానితో చాలా మాట్లాడాలని వుంది. దాని చిన్నప్పటి రోజుల గురించీ, ఆ జ్ఞాపకాల గురించీ తరచి తరచి చర్చించుకుంటూ నా జీవితాన్ని మొత్తం పునశ్చరణ చేసుకోవాలన్నంత ఆత్రంగా వుంది. గతమంతా ఆశ కన్నా నిరాశే ఎక్కువైనా, సుఖాల కన్నా కష్టాలే ఎక్కువైనా, విజయాలకన్నా పోరాటమే ఎక్కువైనా గతాన్ని తల్చుకోవడంలో ఏదో ఆనందం... ఆ కష్టాలూ జీవన పోరాటం గుర్తు చేసుకుంటుంటే నాకిప్పుడు పాత మిత్రురాలిని తలుచుకుంటున్నట్లుగా వుంది. బహుశా జీవిత చరమాంకంలో

ప్రతి మనిషికీ అలాగే అనిపిస్తుందేమో ? శారదతో మాట్లాడే అవకాశం మళ్ళీ వస్తుందో రాదో అన్నట్లుగా లేని ఓపిక తెచ్చుకుంటున్నాను.

" కమల ఎక్కడ వుందే ఇప్పుడూ " అన్నాను.

కాలేజ్ రోజుల్లో కమలా శారదా ఒకరినొకరు ఒక్క క్షణం వదిలి పెట్టి వుండే వారు కాదు. చాలా సార్లు రాత్రుళ్ళు కూడా చదువు వంకతో మా ఇంట్లోనే వుండిపోయి మాతో పాటూ చారన్నం, అప్పడాలూ తిని మా వసారాలోనే జంబుఖానా పరుచుకుని శారదతో కలిసి పడుకుని కబుర్లు చెప్పుకుంటూ వుండిపోయేది. అర్ధరాత్రి వరకూ ఎప్పుడు చూసినా కబుర్లు చెప్పుకుంటూనే వుండే వాళ్ళు. పుస్తకాల గురించీ, సినిమాల గురించీ, కాలేజ్‌లో లెక్చరర్ల గరించీ... నేను కూడా నిద్ర వచ్చే వరకూ వాళ్ళతో కూర్చుని సంభాషణలో పాలు పంచుకునే దాన్ని. అంతలా కబుర్లు చెప్పే శారద ఇప్పుడింత మితభాషి ఎలా అయిపోయిందో అర్ధం కావడం లేదు. కనీసం కమల గురించి గుర్తు చేస్తేనన్నా దానిలో ఉత్సాహం వస్తుందేమోననుకున్నాను.

నా ప్రశ్నకి శారద కొంచెం విసుగ్గా చూసింది.

" మొన్నామధ్యన ఇంజనీరింగ్ కౌన్సిలింగ్‌లో కనిపించింది. వాళ్ళమ్మాయిని జాయిన్ చేయడానికి వచ్చింది. కర్నూల్లోనో ఎక్కడో వుంటున్నానంది. "

దాని సమాధానంలోని నిర్లిప్తతని గమనించినా గమనించనట్లుగానే " పాత సినిమా పాటలెంత బాగా పాడేదే ఆ అమ్మాయి ? అది మన వసారాలో కూర్చుని పాడిన పాటలింకా నా చెవుల్లో వినిపిస్తున్నట్టుగానే వుంటుంది " అన్నాను.

నా మాటలకి శారద నవ్వింది కళ్ళ జోడు సరి చేసుకుంటూ. ఆ నవ్వులో నా కూతురు చిన్నప్పటి శారదని వెదుక్కోవడానికి ప్రయత్నించాను నేను.

నవ్వుతున్న శారద ఏదో గుర్తుకొచ్చిన దానిలా " అమ్మా నీ చంద్రహారం అంటే దానికెంత ఇష్టమో కదా ? నేనూ పెళ్ళయ్యాక అలాంటిది చేయించుకుంటాను అనేది ! " అంది.

శారద మాటల్లో చంద్రహారం అన్న పదం దగ్గర ఆగిపోయాయి నా ఆలోచనలు.

చంద్రహారం ! దానిని నేను నా మెడలో వేసుకుని తిరిగినది తక్కువే అయినా, అది ఒక మధురమైన జ్ఞాపకం నా జీవితంలో ! !

మా అత్తింటి వాళ్ళది బ్రతికి చెడ్డ కుటుంబం. ఒకప్పటి జమీదారీ ఆస్థంతా హరించుకుని పోగా, ఇంట్లో మగవాళ్ళకి తెలియకుండా ఆడవాళ్ళు దాచుకున్న పాత బంగారం కొంత వుండిపోయింది. ముందు చూపుతోనో, మమకారంతోనో మా అత్తగారు ఎన్ని అవసరాలు వచ్చినా ఆ బంగారాన్ని అమ్మకుండా కాలం గడుపుకుంటూ వచ్చింది. వాటిలో తలో నగా  తన కోడళ్ళకిస్తూ ఆ బంగారాన్ని కాపాడుకోవడానికి తనెన్ని అవస్థలు పడిందీ చెప్పుకొచ్చింది. అలా నా వాటాగా వచ్చిన నగే ఆ చంద్రహారం. ఆరు పేటలతో లక్ష్మీదేవి బిళ్ళతో దిట్టంగా, చూడడానికి చాలా అందంగా వుండేది.

ఆవిడ దాన్ని నా మెడలో వేసిన రోజు నేను ఆయనకి దాని కథంతా చెప్పి ఎట్టి పరిస్థితుల్లోనూ దాన్ని అమ్మకూడదని మాట తీసుకున్నాను. ఆ తర్వాత దాన్నయితే అమ్మలేదు కానీ, బంగారం విలువ కాల క్రమంలో బాగా పెరగడంతో అది ఎన్నో అవసరాలలో మమ్మల్ని ఆదుకుంది.

మా అత్త మామలు చనిపోయినపుడు కర్మకాండలకైన ఖర్చుల దగ్గరనుంచీ, శారద పెళ్ళికి, సిద్దూ ఉద్యోగానికి సెక్యూరిటీ డిపాజిట్టు కట్టాల్సి వచ్చినపుడూ ఇంకా ఎన్నో సార్లు మార్వాడీ కొట్టుకు తనఖాగా వెళ్ళి మా అవసరాలని తీర్చింది. ఎన్ని సార్లు దాని మీద అప్పు తెచ్చామో అన్ని సార్లూ దాన్ని ఎలాగోలా విడిపించుకుని తెచ్చుకునే వాళ్ళం. అది నా వంటి మీద కన్నా మార్వాడీ కొట్లోనే ఎక్కువ కాలం వుంది. అయినా అన్ని అవసరాల్లో ఆదుకున్న ఆ హారమంటే నాకు చాలా ఇష్టం. చివరికి మొన్న కూడా సిద్దూ కొడుకు ఇంజనీరింగ్ ఫీజుకి డబ్బు లేక ఇబ్బంది పడుతుంటే నేను వాడిని పిలిచి ఆ చంద్రహారమే ఇచ్చాను. నా వైద్యానికి కూడా దాన్ని తాకట్టు పెడతానంటే నేను వద్దన్నాను.

ఆ చంద్రహారం కమలకి చాలా నచ్చేది. ఒక సారి అది వేసుకుని ఫోటో కూడా తీయించుకుంది, ఇప్పుడు మరి అలాంటి హారం చేయించుకుందో లేదో ? నాకు నవ్వొచ్చింది.నా తదనంతరం ఆ చంద్రహారాన్ని మా అత్తగారి పేరు పెట్టుకున్న శారదకిచ్చేస్తానని చాలా సార్లు అనేదాన్ని.

" నీకు మీ నాన్నమ్మ గుర్తుందటే ? ఆవిడ పోయే సరికి నీకు పన్నెండేళ్ళనుకుంటాను "  అన్నాను ఆ జ్ఞాపకాలతో.

ఏదో మాట్లాడబోతున్న శారద ఠక్కున ఆపేసింది.

మా అత్త మామలు చనిపోయే వరకూ పల్లెటూళ్ళోనే ఆ పాడుబడిన ఇంటిలోనే వుండే వారు. మా దగ్గరకి వస్తే మాకే జరుగుబాటుకి మాకే ఇబ్బందని తెలిసిన వాళ్ళు ఆ పట్నాల్లో మేము వుండలేమని సాకు చెబుతూ రాకుండా తప్పించుకునే వాళ్ళు. మేమే సంవత్సరానికొకసారి వెళ్ళి వాళ్ళని చూసి వచ్చేవాళ్ళం. మేము వచ్చేస్తుంటే కూతుళ్ళకి సారె పెట్టి పంపుతున్నట్లు పొలంలో పండిన పప్పు ధాన్యాల్లో వాళ్ళు ఏడాది పొడవునా పొదుపు చేసి మిగిల్చిన వాటిని మూటలు కట్టి ఇచ్చి పంపే వాళ్ళు పిల్లలు తింటారు అంటూ. ఆ అభిమానానికి మాకు కళ్ళు చెమర్చేవి !

ఆ జ్ఞాపకాల్లో తడిసి ముద్దవుతున్న నేను శారద ముఖంలో భావాలు గమనించే స్థితిలో లేను. వాళ్ళ గురించీ, ఆ రోజుల గురించీ నేను లేని ఓపిక తెచ్చుకుంటూ శారదకి చెప్ప సాగాను. అసలు దానికి చెబుతున్నాననుకుంటూ నాకు నేనే చెప్పుకుంటున్నాననిపించి నాకు నవ్వు కూడా వచ్చింది.

నేను మాట్లాడుతున్న మాటలు శారదకి నచ్చడం లేదని తెలుస్తోంది. నేను చెబుతున్న విషయాలు కాకుండా ఇంకేదో మాట్లాడాలని కోరుకుంటోంది. అవి కాకుండా నేనింకేదో చెప్పాలని ఆశిస్తోందని అర్థమౌతోంది దాని ముఖం చూస్తుంటే.

నేను దానినుంచి ఏదో ఆశిస్తుంటే అది నానుంచి మరేదో ఆశిస్తోంది.  నేను మా అత్తగారి గురించి చెబుతుంటే అది చంద్రహారం గురించి అడుగుతోంది. చిన్నప్పుడు వాళ్ళ తండ్రి క్రమశిక్షణ గురించి గుర్తు చేస్తుంటే అది పెన్షన్లోంచి మనవల పేరున చిన్న చిన్న రికరింగ్ డిపాజిట్లు కట్టే నా అలవాటు  గురించి అడుగుదామనుకుంటోంది. సంభాషణని ఇద్దరం చెరో దారీ మళ్ళిద్దామని ప్రయత్నిస్తుండడంతో దారీ తెన్నూ లేనట్టుగా తయారయ్యాయి మా మాటలు.

కాసేపటికి శారద ముఖంలో విసుగు స్పష్టంగా కనిపించింది. " ఇప్పుడు అవన్నీ అవసరమామ్మా ? " అంది.

నేను నవ్వుకున్నాను. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు ?

" డాక్టరు నిన్ను ఎక్కువగా మాట్లాడకుండా రెస్ట్ తీసుకోమన్నాడు కదా ? " అంటూ బలవంతంగా నన్ను పడుకోపెట్టి దుప్పటి కప్పింది.

నేను కళ్ళు మూసుకున్నాను. కోడలు చెప్పిన డైట్ ప్రకారం సమయానికి నాకు అన్నం జావలా పిసికి స్పూనుతో తినిపించింది. సగం తిన్నాను, మిగిలిన సగం దాని చేతుల్లోనే కక్కేసాను. శారద ఓపిగ్గా అదంతా

తుడిచి నన్ను లేపి కూర్చోపెట్టి పొడి గుడ్డతో శుభ్రంగా తుడిచి నాకు బట్టలు మార్చి మళ్ళీ పడుకోపెట్టి మందులు వేసింది.

ఈసారి మాట్లాడితే శారద తిడుతుందని భయం వేసి బలవంతంగా కళ్ళు మూసుకున్నాను. మందుల ప్రభావం వల్ల నాకు తెలియకుండానే నిద్ర పట్టేసింది. నిద్రలో మళ్ళీ కలలు... నేనూ, ఆయనా... సిద్దూ, శారదా చిన్న చిన్న పిల్లలు, వాళ్ళ స్నేహితులు, అవసరాలు... అప్పులు... చంద్రహారం...

***

నాకు మెలకువ వచ్చేసరికి సిద్ధార్ధ వచ్చేసాడు. పక్క గదిలో సిద్దూ , శారద ఏదో మాట్లాడుకుంటున్నారు. కిటికీలోంచి వెలుతురు లోపలికి పడకపోవడం వల్ల నాకు చీకటి పడిందని అర్థమైంది.

కాసేపటికి శారద గదిలోకి వచ్చింది. నేను కళ్ళు తెరిచి వుండడం చూసి లైటు వేసింది.

" వెళ్ళొస్తానమ్మా... ఆరోగ్యం జాగ్రత్త ! " అంది.

" అప్పుడే వెళ్ళిపోతున్నావా ? "  చిన్న పిల్లలా అన్నాను.

" అవును. ఇంకో పావుగంటలో లోకల్ ట్రైన్ వుంది. ట్రైన్లో అయితే ప్రయాణం సుఖంగా వుంటుంది" అంది.

" శారదా ఇలా రా "  దగ్గరగా రమ్మని పిలిచాను దానిని. కొంచెం కష్టపడి మోచేతి మీద బరువానించి పైకిలేచి పరుపు క్రింద దాచి పెట్టిన ఒక కవరు తీసి శారదకిచ్చాను.

" నేనింకా ఎన్నాళ్ళుంటానో ఏమో... " అన్నాను ఆ కవరు దాని చేతిలో పెడుతూ.

" ఏమిటమ్మా ఇది ? " అంది శారద ఆ కవరు విప్పబోతూ.

" ఇప్పుడు కాదు. ట్రైనుకి టైమవుతోందంటున్నావుగా. ఇంటికి వెళ్ళి తీరికగా చూసుకో. జాగ్రత్త ! " అన్నాను నేను.

శారద ఇంకేం మాట్లాడకుండా కవరు హ్యాండ్ బ్యాగ్‌లో పెట్టుకుని నాకు వీడ్కోలు చెప్పి బయలు దేరింది.

నా పరిస్థితి నాకు తెలుస్తూనే వుంది.

***

బహుశా లోకల్ ట్రైన్‌లో కూర్చుని శారద ఆ ప్యాకెట్ విప్పి చూసి వుంటుంది. అందులో నాకు ఓపిక వున్నపుడు కూర్చుని చెయ్యి కూడదీసుకుని నా మనవరాలి నోట్ బుక్‌లోని ఒక కాగితం మీద శారద కోసం రాసిన విషయాలున్నాయి. ఇందాకా నేను మాట్లాడుతున్నపుడు శారద ముఖం చిట్లించుకున్న సంగతులు కాకుండా సూటిగా, దావాలో నెగ్గగా వచ్చే మా పొలం డబ్బులో దానికివ్వదలుచుకున్న వాటా వివరాలు, దాని పిల్లలకోసం నేను కూడ బెట్టిన డబ్బు, దానికోసం నేను దాచిన డిపాజిట్ల వివరాలు వున్నాయి ! మరో పాతకాలంనాటి ముఖమల్ సంచిలో మా అత్తగారు నాకిచ్చిన ఆరు పేటల చంద్రహారం వుంది ! !

అలాంటి కవరే మరొకటి నా పరుపు క్రింద సిద్దూకోసం సిద్ధంగా వుంది.

ఆ ప్యాకెట్ విప్పి చూసిన శారద కళ్ళు చెమర్చి వుంటాయి. లోకల్ ట్రైన్ దిగి ఇంటికెళ్ళి వెళ్ళగానే దానికి కబురు తెలిస్తుంది. మళ్ళీ అందరూ టాక్సీలో ఇక్కడికి వస్తారు.

నిశ్చలంగా, నిరామయంగా పడుకుని వున్న నా కాళ్ళ దగ్గర కూర్చుని కన్నీరు కారుస్తూ వుంటారు సిద్దార్థ, శారద... దుఃఖంతో, బాధతో, ఒకింత పశ్చాత్తాపంతో వాళ్ళ గొంతులు పూడుకుపోయి వుంటాయి.

ఆఖరి రోజు కూడా నాతో సరిగ్గా మాట్లాడనందుకు శారద మీద కానీ, నేను అడిగినా సెలవు పెట్టి ఇంట్లో వుండనందుకు సిద్దూ మీద కానీ నాకు కోపం లేదు. చంద్రహారం మా అత్తగారి చేతుల్లోంచి నా చేతుల్లోకి మారినట్లే జీవితం మా చేతుల్లోంచి సిద్దూ శారదల చేతుల్లోకి మారింది... చంద్రహారం ఇంట్లోంచి మార్వాడీ కొట్లోకీ మార్వాడీ కొట్లోంచి ఇంట్లోకీ తిరిగినట్లు ఆశా నిరాశల మధ్య ఊగిసలాడడమే జీవితం ! పోరాటం లేకపోతే జీవితమే లేదు.

జీవితాన్ని అర్థం చేసుకునే పరిణితి సాధించకపోతే నాకు మరణించడానికి అర్హత లేనట్లే !

*

రచయిత పేరు : ఆకునూరి మురళీకృష్ణ
చిరునామా : ఆకునూరి మురళీకృష్ణ
907, నాగార్జునా అపార్ట్‌మెంట్స్
అశోక్ నగర్, కర్నూలు
e-mail : akunuri_murali@yahoo.co.in ***Phone : 9848174957, 9395587974***